క్లుప్తంగా

బాప్టిస్టు సంఘాల మహాసభ



నూతనంగా ఎన్నికైన సంఘం కార్యవర్గం

పాయకరావుపేట : ఉత్తర సర్కారుల బాప్టిస్టు సంఘాల సర్వసభ్య సమావేశం నిర్వహించినట్టు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగిందన్నారు. సంఘం అధ్యక్షునిగా టి.ఐజాక్ విశాఖపట్నం, ఉపాధ్యక్షులుగా కె.సుభద్ర కాకినాడ, కార్యదర్శిగా ఎ.డి.కె జాన్, (తుని), రికార్డింగ్ కార్యదర్శిగా ఎన్.ఆర్. కుమార్ (నర్సీపట్నం), కోశాధికారిగా జి.ఎలీషా (పిఠాపురం), ట్రస్టు అసోసియేషన్ చైర్మన్‌గా వై.కృష్ణమూర్తి (విశాఖ), ట్రస్టు కార్యదర్శిగా ఎ.జోషీపాల్ (తుని) ఎన్నికైనట్టు సంఘం నూతన కార్యవర్గం ఒక ప్రకటనలో తెలిపింది.

పోషకాహారం పంపిణీ



పోషకాహారం అందజేస్తున్న ఉమ్మలాడ సర్పంచ్ గంగయమ్మ

మునగపాక : పోషక విలువలతో కూడిన ఆహారం శ్రేయస్కరమని ఉమ్మలాడ సర్పంచ్ సూరిశెట్టి గంగయమ్మ పేర్కొన్నారు. ఉమ్మలాడలో శనివారం బాలింతలు, గర్భిణులకు ఆమె పోషకాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటున్నారన్నారు. కేంద్రానికి వచ్చే పిల్లలతో పాటు బాలింతలు, గర్భిణులకు అవసరమయ్యే మెరుగైన పోషకాహారం అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు, మహిళలు పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ట



శ్రీదేవి, భూదేవి సమేత వల్లభ నారాయణ స్వామి ఉత్సవ విగ్రహాలకు పూజలు

రాంబిల్లి : దిమిలిలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత వల్లభ నారాయణస్వామి ఉత్సవ విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇదే గ్రామానికి చెందిన ఎస్.గొల్లబాబు ఈ విగ్రహాలను అందజేశారు. ఆలయ అర్చకులు నేతేటి రామచంద్రాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు, పురోహితులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. పలువురు భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

పారిశుధ్య కార్మికులకు విశ్రాంత డీపీఎంవో వితరణ

మునగపాక : ఏటా గ్రామంలోని పారిశుధ్యం మెరుగుపరుస్తున్న పారిశుధ్య కార్మికులకు తన వంతు సాయంగా విశ్రాంత డీపీఎంవో ఆడారి సన్యాసిరావు దుస్తులు అందజేశారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి పర్వదినం సందర్భంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందజేస్తుంటారు. ఈ ఏడాది కూడా శనివారం మునగపాక పంచాయతీ పరిధిలోని పారిశుధ్య కార్మికులకు తనవంతు సాయంగా వస్త్రాలు అందజేసి ఔదార్యం చాటుకున్నారు.

గోదా కల్యాణోత్సవానికి సన్నాహాలు



కల్యాణోత్సవం నిర్వహించనున్న ఉత్సవ విగ్రహాలు

కశింకోట : స్థానిక రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో భోగి పండగను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం గోదాదేవి (ఆండాళమ్మ) కల్యాణోత్సవం నిర్వహించడానికి సన్నాహాలు చేశామని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు తెలిపారు.15న సంక్రాంతిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు, విష్ణు సహస్ర నామార్చన జరుగుతాయన్నారు.

వాహనమిత్ర...సంక్షేమ రక్ష

- రాంబిల్లి మండలంలో 414 మందికి లబ్ధి
- ఐదు విడతల్లో రూ 2.07 కోట్లు మేర పంపిణీ
- గత ప్రభుత్వాల హయాంలో ఇలాంటి పథకం లేదు
- ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల హర్షం



ఆటోతో వాహనమిత్ర లబ్ధిదారు



ఆటోలతో వాహనమిత్ర లబ్ధిదారులు

రాంబిల్లి: సంక్షేమం , అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లక్ష్యం. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో పలు రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు, యజమానులకు అమలు చేయని పథకాన్ని సీఎం జగన్ అమలు చేశారు. పాదయాత్రలో ఇచ్చిన హామీని ఆచరణలో తీసుకువచ్చారు. వాహనమిత్ర పేరుతో కొత్త పథకాన్ని తీసుకువచ్చారు. ఏటా లబ్ధిదారుకు రూ.10వేలు ఆర్థికసాయాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఇలా ఐదు దఫాలు నగదు జమ చేసి భరోసా ఇచ్చారు. వాహనమిత్ర పథకంలో రాంబిల్లి మండలంలో 17 గ్రామ సచివాలయాల పరిధిలో 414 మంది లబ్ధిదారులు ఈ పథకం కింద ఐదు విడతలో రూ 2.07కోట్లు మేర లబ్ధి పొందారు. బతుకుతెరువు కోసం ఆటోలు, ట్యాక్సీలు కొనుగోలు చేసి డ్రైవర్లుగా వుంటూ లక్షలాది మంది జీవనం సాగిస్తున్నారు.

అనారోగ్యం బారిన పడిన యజమానులు వారి వాహనాలను లీజుకు ఇవ్వడం లేదా డ్రైవర్లను పెట్టుకొని తమ తమ వాహనాలను తిప్పుకొంటున్నారు. తద్వారా వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

గత ప్రభుత్వ హయాంలో మాదిరి జన్మభూమి కమిటీల లాలూచీలు, చేయి తడపడాలు లేకుండా సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సహకారంతో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం నిబంధనల ప్రకారం అర్హత వుంటే ఎటువంటి లాలూచీలు, పైరవీలు లేకుండా పథకానికి ఎంపికవుతున్నారు. వాహనమిత్ర పథకానికి ఇదే



తరహాలో పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఐదు విడతలుగా లబ్ధిదారులకు వాహనమిత్ర ఆర్థిక సాయంను ప్రభుత్వం అందజేసింది.

ఇన్సూరెన్స్‌కు సాయపడుతుంది

వాహనమిత్ర పథకం ద్వారా వచ్చే ఆర్థిక సాయాన్ని ఇన్సూరెన్స్ కట్టుకునేందుకు ఉపయోగించాను. ఏటా రూ.10వేలు ఆర్థిక సాయంలో దాదాపు రూ.5500 ఇన్సూరెన్స్ కట్టి మిగతా సొమ్మును ఆటో నిర్వహణకు ఉపయోగించుకునేవాణ్ణి. జగనన్న మా లాంటి వారందరికీ సాయం చేయడం గొప్ప విషయం

– డి. నాగభూషణం, ఆటోడ్రైవర్, రజాల

ఎంతో మేలు జరుగుతుంది



వాహనమిత్ర పథకంలో లబ్ధిదారులకు ఎంతో మేలు జరుగుతుంది. ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు, యజమానులకు వాహనమిత్ర వరంలా మారింది. ఏటా ఎటువంటి అక్రమాలకు తావులేకుండా లబ్ధి దారులను గుర్తించి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసిన జగనన్నకు అభినందనలు

–చవ్వాకుల లచ్చుబాబు, ఆటో యూనియన్ అధ్యక్షుడు, దిమిలి

414 మందికి లబ్ధి



వాహనమిత్ర పథకంలో భాగంగా 17 సచివాలయాల పరిధిలో 414 మందికి లబ్ధి చేకూరింది. ఐదు విడతల్లో రూ. 2.07 కోట్లు మేర నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. లబ్ధిదారులను సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా ఎంపిక చేసి పథకాన్ని అమలు చేయడం జరిగింది.

–కె.ఎస్. కొండలరావు, మండల అభివృద్ధి అధికారి, రాంబిల్లి

సందడి చేసిన పూర్వ విద్యార్థులు



1976-77 టెన్త్ విద్యార్థులు

అనకాపల్లి : పూర్వ విద్యార్థులంతా ఉన్నత స్థానాల్లో స్థిరపడడం ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థి సంఘం కన్వీనర్ కాండ్రేగుల దుర్గాప్రసాద్ అన్నారు. జీవీఎంసీ హైస్కూల్లో 1976–77లో టెన్త్ విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు స్కూల్ ఆవరణలో శనివారం కలుసుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పిల్లల భవిష్యత్‌ను కూడా తీర్చిదిద్ది, వారికి బంగారుబాట వేయాలని సూచించారు. అంతకు ముందు వారంతా ఆప్యాయంగా పలికరించుకుని చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. వారంతా మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. సంఘ కో కన్వీనర్ కాండ్రేగుల సత్యనారాయణ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు మునగపాకలో జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు

మునగపాక : సంక్రాంతి సంబరాల్లో భాగంగా మునగపాకలో ఈ నెల 15న జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గ్రామ రైతులు, గౌరీ యూత్, సంతబయిల యూత్ సంయుక్త నిర్వహణలో బైపాస్ రోడ్డు దరి 2 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఎంట్రీ ఫీజుగా రూ.200 చెల్లించాలన్నారు. మొదటి బహుమతిగా రూ.12వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10వేలు, తృతీయ బహుమతిగా రూ.8వేలు, చతుర్ద బహుమతిగా రూ.6వేలు, పంచమ బహుమతిగా రూ.3వేలు అందజేస్తామన్నారు. బహుమతికి నోచుకోని ప్రతి బండికి రూ.2500 వంతున ప్రైజ్‌మనీ అందజేస్తామన్నారు. ఆసక్తి కల వారు ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి అప్పలనాయుడు, ఫోన్ నంబరు 9666682625 ను సంప్రదించాలని కోరారు.

సంప్రదాయ డోలిక.. ఆనందాల వేడుక

- నేటి నుంచి సంక్రాంతి సంబరాలు
- బంధుమిత్రులతో కళకళలాడుతున్న తెలుగు లోగిళ్లు
- నేడు భోగభాగ్యాల భోగి



డూడూ బసవన్న అంటూ ఇళ్ల వద్ద సందడి చేస్తున్న గంగిరెద్దు కులస్తులు



యలమంచిలిలో కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న ప్రధాన రహదారి

యలమంచిలి రూరల్ : గంగిరెద్దులు,.గొబ్బెమ్మ పాటలు..రంగవల్లులు..హరిదాసు కీర్తనలు..బుడబుడక్కల చప్పుళ్లు..అత్తారింట కొత్త అల్లుళ్లు..కొంటె మరదళ్ల సందళ్లు..పిండివంటల ఘుమఘుమలు..అబ్బో.!జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి శోభ ఉట్టిపడుతోంది. మూడురోజుల పండుగను వైభవంగా జరుపుకునేందుకు ప్రజానీకం సిద్ధమైంది.ఇప్పటికే సంక్రాంతికి కావాల్సిన సరంజామాను సమకూర్చుకుని మూడురోజుల పండగ ముచ్చటైన పండుగను చేసుకునేందుకు అంతా సిద్ధమయ్యారు.

కొత్త సంవత్సరంలో తొలిసారిగా వచ్చే పెద్ద పండుగ సంక్రాంతి. మూడు రోజుల ఈ పండుగ నిర్వహణలో ప్రత్యేకత ఉంది. ఈ పండగ పూర్తిగా పల్లెటూరి సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తుంది. సంక్రాంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు స్థానికులు సిద్ధమయ్యారు. ముఖ్యంగా భోగి, కనుమ మధ్యలో వచ్చే సంక్రాంతి పెద్ద పండగ మాత్రమే కాదు పెద్దల పండుగ కూడా. మొదటి రోజు అంటే ఆదివారం వేకువజాము భోగి మంటలు వేసుకునేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇళ్ల ముందు కళ్లాపి చల్లి ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెట్టడం, రెండో రోజు పెద్దల పండుగగా పితృదేవతలకు సమర్పణలు చేయడం, మూడో రోజు పాడిపంటలనిచ్చే పశువులకు పూజలు చేసి గ్రామ వాసుల జీవితంలో మమేకమైన పశుసంపదను గౌరవించి, ఆరాధించడం సంప్రదాయంగా వస్తోంది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో అనకాపల్లి, యలమంచిలి, నర్సీపట్నం, చోడవరం, పాయకరావుపేట, అచ్యుతాపురం సహా అన్ని మండల కేంద్రాల్లో వస్త్ర దుకాణాలు, మార్కెట్లు కుసుగోలుదారులతో కిటకిటలాడాయి. ఇతర ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వచ్చే బంధుమిత్రుల రాకతో బస్సులు, రైళ్లతో పాటు ప్రయాణ ప్రాంగణాలన్నీ శనివారం రద్దీగా కనిపించాయి.



హరిదాసు సందడి

భోగి మంటలకు ఏర్పాట్లు

మునగపాక : మండల వ్యాప్తంగా ఆదివారం భోగి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. పొలాల్లోని చెరకు చెత్తతో పాటు కలపను పోగు చేసి పందిర్లు ఏర్పాటు చేశారు. యువకులు ఈ భోగి పండగను ఉత్సాహంగా నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకున్నారు.

ఇజ్రాయిల్ దాడులపై జనసాహితి నిరసన

అనకాపల్లి : ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులను తక్షణమే నిలిపివేయాలని జనసాహితీ జిల్లా అధ్యక్షుడు శివాజీరావు అన్నారు. స్థానిక నెహ్రూచౌక్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం ఇజ్రాయిల్ దాడులకు జనసాహితీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మూడు నెలలుగా గాజా, వెస్ట్‌బ్యాంకుల్లో ఇజ్రాయిల్ జరుపుతున్న దాడుల కారణంగా వేలాది మంది పిల్లలు, పౌరులు మరణించారని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. అంతకుముందు పట్టణంలో రామచంద్ర థియేటర్ నుంచి నెహ్రూచౌక్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు జగదీష్, పెంటాద్రిరావు, శాస్త్రి, రంగబాబు, ప్రసాద్, శ్రీను, బలరాం పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న శివాజీరావు

నేడు ఉపమాకలో గోదా రంగనాథుల కల్యాణం



గోదాదేవి అమ్మవారు

నక్కపల్లి : ధనుర్మాసం పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం గోదా రంగనాథుల కల్యాణం అంగరంగ వైభవంగా జరగనుంది. ఇందుకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఏర్పాట్లు చేశారు. గోదాదేవి శ్రీరంగనాథున్ని వివాహమాడడం కోసం నెల రోజుల పాటు ధనుర్మాస వ్రతం ఆచరించింది. భోగి పండగతో ఈ వ్రతం పూర్తి కావడంతో శ్రీరంగనాథుడు గోదాదేవిని వివాహమాడడానికి అంగీకరించడంతో గోదా కల్యాణం భోగి పండగ నాడు నిర్వహిస్తారు. ఉపమాకలో స్వామివారి పుష్పతోటలో గోదారంగనాథుల కల్యాణం భోగినాడు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా గోదాదేవి అమ్మవారిని నూతన వస్త్రాలంకరణలో అలంకరించారు. ఆదివారం ఉదయం కొండపై గల మూలవిరాట్ సన్నిధిలో నిత్యార్చనలు, అభిషేకాలు నిర్వహిస్తారు. కొండ దిగువన ఆండాళ్లమ్మ (గోదాదేవి) సన్నిధిలో నిత్య కార్యక్రమాలు అనంతరం గోదాదేవి అమ్మవారిని స్వామి వార్లను పల్లకిలో స్వామివారి పుష్పతోటలోకి తీసుకెళ్తారు. అక్కడ అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహిస్తామని ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. కల్యాణం అనంతరం స్వామి అమ్మవార్లకు రాజాధిరాజ వాహనంలో తిరువీధి సేవలు నిర్వహిస్తామన్నారు.

ఎస్.రాయవరం : ధనుర్మాసోత్సవాలు పురస్కరించుకుని ఆదివారం వమ్మవరం శ్రీ స్వయంభూ వేంకటేశ్వరస్వామి, దార్లపూడి శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి, గుడివాడ శ్రీ వేంకటేశ్వరస్వామి, ఎస్.రాయవరం శ్రీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో గోదాదేవి కల్యాణం నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. నెల రోజులుగా ఈ ఆలయాల్లో తిరుప్పావై పాశురాలు చదివి పూజలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఈ ఆలయాల్లో గోదాదేవి కల్యాణాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు

- వాలీబాల్ విజేత నాగవరం జట్టు
- క్రికెట్ విజేత పాటిపల్లి



వాలీబాల్ విజేతకు రూ.6వేల సాయం అందజేస్తున్న మాజీ ఎంపీపీ గౌరీలక్ష్మి అప్పారావు

మునగపాక : మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి క్రీడాకారుల నుంచి విశేష స్పందన కనిపించింది. సచివాలయాల పరిధిలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారిని మండల స్థాయికి ఎంపిక చేశారు. మండల స్థాయి ప్రతిభ చూపిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వాలీబాల్ పోటీల్లో నాగవరం జట్టు విజేతగా నిలిచి నియోజకవర్గ స్థాయికి ఎంపికైంది. ఈ మేరకు మాజీ ఎంపీపీ దాసరి గౌరీలక్ష్మి అప్పారావు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టీ షర్ట్స్ కొనుగోలుకు రూ.6వేల సాయం అందజేశారు. పాటిపల్లిలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో పాటిపల్లి జట్టు విజేతగా నిలిచి నియోజకవర్గ స్థాయికి ఎంపికైంది. క్రీడాకారులను పాటిపల్లి సర్పంచ్ ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు పరిచయడం చేసుకొని నియోజకవర్గ స్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : పేదోడికి సహాయం చేయడంలో కలిగే సంతృప్తి మరొకటి ఉండదని ముసలమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు బంగారి చిట్టి అన్నారు. రేవు పోలవరం గ్రామంలో సంక్రాంతి వేడుకను పురస్కరించుకుని చలి కూడా బాగా ఎక్కువ ఉండడంతో సుమారు 80 మందికి వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మధ్య తరగతి కుటుంబంలో జీవిస్తున్న బంగారు చిట్టి చనిపోయిన తల్లి పేరున ఇటువంటి సేవ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చోడిపల్లి అనూరాధ గోవిందులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పండగలో జూదాలు నిషేధం



షేక్ గపూర్, సీఐ, యలమంచిలి

యలమంచిలి రూరల్ : సంక్రాంతి సమయంలో పట్టణాలు, గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్నట్టు యలమంచిలి సీఐ షేక్ గఫూర్ చెప్పారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కోడి పందాలు, జూదం, గుండాట, అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కోడి పందాలు నిర్వహించడం, ఆడడం చట్టరీత్యా నేరమన్నారు. కోడి పందాలపై నిఘా పెట్టామని, గతంలో కోడి పందాలకు సంబంధించిన పాత కేసుల్లో ఉన్న వారి కదలికలపై గ్రామాల వారీగా నిఘా పెట్టామన్నారు. ఇప్పటికే అలాంటి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని గ్రామ పెద్దలకు సూచించామన్నారు. కోడి పందాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రాంతాలపై దృష్టి సారించామన్నారు. పండగ ముసుగులో కోడి కత్తులు కట్టి పందాలు నిర్వహించడం, గుండాట, జూద క్రీడలు, బరులను ఏర్పాటు చేసి అనుమతి లేకుండా మద్యం విక్రయించడం వంటివి చేస్తే కటకటాల్లో వేస్తామని హెచ్చరించారు. ప్రజలు అసాంఘిక కార్యక్రమాల గురించి తెలిస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. కోడి పందాల కట్టడిలో ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సంక్రాంతి పండగ సందర్భంగా ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు ఇళ్లలో విలువైన బంగారు, వెండి వస్తువులు, నగదు ఉంచరాదని సూచించారు. ఇళ్లకు తాళం వేసి వెళ్లేవారు సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇస్తే చోరీలు జరగకుండా నిఘా ఉంచుతామన్నారు. ఇప్పటికే ఈ విషయాలపై సర్కిల్ పరిధిలో పోలీస్‌స్టేషన్లలో ఎస్‌ఐలు, సిబ్బందిని అప్రమత్తం చేశామని చెప్పారు. ప్రజలంతా సంక్రాంతి పండగను సంప్రదాయబద్ధంగా ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

కొట్లాట కేసులో 13 మంది అరెస్టు



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

పాయకరావుపేట : మండలంలో గల పెదరాంభద్రపురం గ్రామంలో గురువారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో ఒక వ్యక్తి మృతి చెందిన కేసులో 13 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం రాత్రి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పెదరాంభద్రపురం గ్రామానికి చెందిన శీలి నూకరాజుకు, గంపల నూకరాజుకు మధ్య జరిగిన ఘర్షణ కొట్లాటకు దారి తీసింది. గ్రామ సెంటర్‌లో గల అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద అందరూ కూర్చునే గట్టు మీదకు శీలి నూకరాజు చెప్పులతో ఎక్కగా.. గంపల నూకరాజు అలా చెప్పులతో ఎక్కరాదని అభ్యంతరం తెలిపారు. దీంతో వారిద్దరి మధ్య గొడవ మొదలయింది. దీంతో శీలి నూకరాజు వర్గీయులు గంపల నూకరాజు వర్గీయులు కొట్లాటకు దిగారు. గంపల నూకరాజును ఇనుప రాడ్లతో కొట్టడంతో మృతి చెందినట్లు తెలిపారు. ఈ కేసులో శీలి సత్తిబాబు, తమ్మలపల్లి మహేష్, శీలి అప్పారావు, శీలి రత్నరాజు, శీలి రాజు, శీలి నూకరాజు, శీలి నాగేశ్వరరావు, శీలి వెంకటలక్ష్మి, శీలి నూకరత్నం, శీలి మారియ, శీలి నరేంద్ర, శీలి నూకరాజు, శీలి సూరిబాబులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఏఎస్పీ తెలిపారు.

గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశామన్నారు. నిందితులు ఉపయోగించిన ఇనుప రాడ్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో సీఐ పి.అప్పలరాజు, నక్కపల్లి ఎస్‌ఐ విభీషణరావు, నర్సీపట్నం సీఐ పి.రమణయ్య, స్థానిక ఎస్‌ఐలు ఎస్.రమేష్, బి.జోగారావు, ఏఎస్‌ఐ గోవిందు పాల్గొన్నారు.

మద్యం నిల్వ ఉంచిన వ్యక్తి అరెస్టు

మునగపాక : ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం సీసాలను ఇంటిలో ఉంచిన యువకుడిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ మహ మ్మద్ అలీ షరీఫ్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు మునగపాక సంతబయిలలో ఎస్‌ఐ సిబ్బందితో కలిసి దాడి చేయగా, ఎటువంటి అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన 51 మద్యం సీసాలను గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.